




# కరపత్రం

SINCE 2014

శుక్రవారం ఆగస్ట్ 21, 2026 | సంపుటి : 2 | సంచిక : 310 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4





# 22ఏ భూములపై

## తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం

- 22ఏ భూములపై కీలక నిర్ణయం!
- సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల్లో 22ఏ లిస్ట్ డిస్‌ప్లే
- వారం రోజుల్లో జాబితా అందుబాటులోకి
- 22ఏలో 3.73 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి
- 22ఏ సమస్య ఉన్నా రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయి
- ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్.. 400 కాల్స్



**హైదరాబాద్:**
22ఏ భూములపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలకు ఇబ్బంది కాకుండా ఎస్ఆర్‌వోలలో 22ఏ లిస్ట్ డిస్‌ప్లే చేయాలని నిర్ణయించింది. వచ్చే వారం రోజుల లోపు సబ్ రిజిస్టార్ కార్యాలయాల్లో 22A లిస్ట్‌ను ప్రభుత్వం డిస్‌ప్లే చేయనుంది. 22Aలో 3లక్షల 73వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు.
గడిచిన రెండు రోజుల్లో 25కి పైగా 22ఏ రిజిస్ట్రేషన్లు జరగ్గా, 22A సమస్య ఉన్నా రిజిస్ట్రేషన్లు ఆగడం లేదని అధికారులు అంటున్నారు. ప్రతీ రోజు వ్యవసాయం 2500 రిజిస్ట్రేషన్లు.. నాన్ అగ్రికల్చర్ 4500 పైగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు సమాచారం. 22ఏ పై ఫిర్యాదు చేయడానికి టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. ఇప్పటి వరకు సుమారు 400 కాల్స్ వచ్చినట్లు ప్రకటించింది.



# సోనియా ఆత్మకథ..

## రాహుల్ భావోద్వేగ పోస్ట్

- 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పేరుతో పుస్తకం
- 544 పేజీల ఆత్మకథ.. నవంబరు 10న విడుదల
- అమ్మ కష్టాలు నాకూ, ప్రియాంకకే తెలుసన్న రాహుల్
- "నీ ధైర్యం, గౌరవం చూసి గర్వంగా ఉంది" అంటూ భావోద్వేగం
- రాజీవ్-సోనియా ప్రేమ, పెళ్లి వివరాలు పుస్తకంలో
- రాజకీయాల్లోకి రావడానికి దారితీసిన పరిస్థితులపై సోనియా వెల్లడి

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ జీవిత ప్రయాణంపై 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పేరిట రాసిన 544 పేజీల ఆత్మకథ నవంబరు 10న పాఠకుల ముందుకు రానుంది. తన మాతృమూర్తి జీవిత కథ పుస్తక రూపంలో రానున్న నేపథ్యంలో రాహుల్ గాంధీ భావోద్వేగానికి గురయ్యారు. "అమ్మా.. నిన్ను నాన్ననూ కలిసి చివరిసారి చూసి 35 ఏళ్లకు పైగా దాటింది. నాన్న వెళ్లిపోయినప్పటి నుంచి ప్రతి సవాల్‌ను నువ్వు ఎంతో ధైర్యం, గౌరవంతో ఎదుర్కొన్నావు. నువ్వు ఎదుర్కొన్న కష్టాలు ఏంటో ప్రియాంకకు, నాకు మాత్రమే తెలుసు" అని రాహుల్ ఎక్స్‌లో భావోద్వేగపూరితంగా రాసుకొచ్చారు. తన తల్లి ఆత్మకథను లక్షల మంది చదవబోతున్నందుకు గర్వంగా ఉందన్నారు. వ్యక్తిగత జీవితాన్ని ఎప్పుడూ బహిరంగంగా చెప్పేందుకు ఇష్టపడని ఆమెకు.. ఈ కథను ప్రపంచంతో పంచుకోవడం ఎంత కష్టమో తనకు తెలుసన్నారు. గురువారం రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా "పాపా తన అందమైన సోనియాను చూసి గర్వంగా నవ్వుతూ ఉండొచ్చు" అని రాహుల్ పేర్కొన్నారు.

మిగతాద్ది 2 లో



# నేడు హైదరాబాద్‌కు వైఎస్ జగన్

**తాడేపల్లి:**
వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు (21 ఆగస్టు, శుక్రవారం) హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి, 11 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు.అక్కడి నుంచి జలవిహార్ గ్రాండ్ లాన్స్‌లో జరిగే సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు కుమారుడి వివాహ వేడుకకు హాజరవుతారు. నూతన వధూవరులను ఆశీర్వదించిన అనంతరం వైఎస్ జగన్ అక్కడి నుంచి తిరుగు ప్రయాణమవుతారు.

2 లో



# కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

## - మహేశ్‌కుమార్ గౌడ్

**నిజామాబాద్:**
పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా క్రమశిక్షణ చర్యలు తప్పవని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. గురువారం నిజామాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చిన్నారెడ్డి, కొండా సుస్మిత వ్యాఖ్యలపై స్పందించారు.

# సుస్మిత వ్యాఖ్యలు వ్యక్తిగతం!

- నన్ను బాధ్యురాలిని చేయొద్దు: కొండా సురేఖ
- సుస్మిత వ్యాఖ్యలతో నాకు సంబంధం లేదు
- ఆమె అభిప్రాయాలు పూర్తిగా వ్యక్తిగతం
- పార్టీ నియమావళిపై గౌరవం ఉంది
- షోకాజ్ నోటీసు ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి

2 లో



# వచ్చే ఎన్నికలకు భూ భారతి రెఫరెండం!



2లో..

- భూ భారతి పనితీరుపైనే ప్రజా తీర్పు: పొంగులేటి
- భూ సమస్యల్లేని తెలంగాణే లక్ష్యం
- రైతుల భూములకు పూర్తి భద్రత
- గ్రామసభలతో భూ రికార్డుల సవరణ
- బీజేపీ, బీఆర్ఎస్ విషప్రచారం చేస్తున్నాయంటూ విమర్శ
- రాబోయే ఎన్నికల్లో ప్రజలే తీర్పు ఇస్తారన్న మంత్రి

**ఖమ్మం:**
భూ సమస్యల్లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. భూ భారతి ద్వారా రైతన్నల భూములకు పూర్తి భద్రత కల్పిస్తామని, గ్రామసభల ద్వారా భూ రికార్డులను పారదర్శకంగా సరిదిద్దుతున్నామన్నారు.

# బైక్‌పై సీపీ సజ్జనార్!

- సివిల్ డ్రెస్‌లో సామాన్యుడిలా పర్యటన
- కేబీఆర్ వన్‌వే ట్రాఫిక్‌ను స్వయంగా పరిశీలన
- రోడ్డు నంబర్ 45 నుంచి పలు జంక్షన్లలో తనిఖీ
- ట్రాఫిక్ పోలీసులతో క్షేత్రస్థాయి వివరాలు సేకరణ
- వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



2లో..

**హైదరాబాద్:**
కేబీఆర్ పార్కు పరిసరాల్లో కొత్తగా అమల్లోకి తెచ్చిన వన్‌వే ట్రాఫిక్ విధానాన్ని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్వయంగా పరిశీలించారు. గురువారం ఉదయం 10 గంటలకు ఎలాంటి ఆర్భాటాలు లేకుండా.. సాధారణ పౌరుడిలా సివిల్ దుస్తుల్లో బైక్‌పై ప్రయాణిస్తూ క్షేత్రస్థాయి ట్రాఫిక్‌ను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు.రోడ్ నంబర్ 45 నుంచి జూబ్లీ చెక్‌పోస్ట్, వెంకటగిరి, కేబీఆర్ పార్క్ ప్రధాన గేటు, ముగ్ధ జంక్షన్, బసవతారకం,

# కాంగ్రెస్‌లో భూకంపం..

## తన వ్యాఖ్యలపై సుస్మితా పటేల్ వివరణ



2లో

**వరంగల్:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తాను చేసిన వ్యాఖ్యలు తన వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని మంత్రి కొండా సురేఖ కూతురు కొండా సుస్మితా పటేల్ చెప్పారు. తన వ్యాఖ్యలతో కొండా సురేఖకు ఎటువంటి సంబంధమూ లేదని తెలిపారు. రాజకీయంగా ఒకే కుటుంబంలో కూడా అభిప్రాయభేదాలు ఉంటాయని చెప్పారు.

# రూ.100 కోట్ల ఏవో!

- ఏసీబీ సోదాల్లో భారీ ఆస్తులు
- కిలోకు పైగా బంగారం
- 8 ప్లాట్లు.. 10 ఎకరాల భూమి
- మూడంతస్తుల భవనం గుర్తింపు
- 3 కార్లు.. రూ.12 లక్షల నగదు
- మార్కెట్ విలువ రూ.100 కోట్ల పైమాటే

**హైదరాబాద్:**
ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో అడ్మిన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో భారీగా ఆస్తులు గుర్తించారు. ఈ మేరకు ఏసీబీ డీఎస్పీ ఆనంద్ వివరాలు వెల్లడించారు. శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో కిలోకు పైగా బంగారం, 8 ఖాళీ స్థలాలు, యాచారంలో 10 ఎకరాల భూమి, హస్తినాపురంలో మూడంతస్తుల భవనం, ఓ బార్‌లో కుమారుడి పేరిట రూ.86 లక్షల పెట్టుబడి, 7 బ్యాంకు ఖాతాల్లో రూ.8 లక్షలు, ఇంట్లో రూ.4 లక్షలు, 3 కార్లు, 3 ద్విచక్ర వాహనాలు గుర్తించారు. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రూ.100 కోట్లపైగానే ఉంటుందని ఏసీబీ అధికారుల అంచనా వేస్తున్నారు. గతంలో శ్రీనివాస్‌రెడ్డి మహేశ్వరం తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించారు.



మిగతాది 2లో

# కారంలో 30% చెక్కపొడి!

- మేడ్చల్‌లో కల్తీ మసాలా కేంద్రంపై దాడి
- కారం, పసుపు, ధనియాల పొడిలో కల్తీ
- డూప్లికేట్ బ్రాండ్ ప్యాకింగ్‌తో విక్రయాలు
- 10,890 కిలోల కల్తీ పదార్థాలు స్వాధీనం
- విలువ సుమారు రూ.25 లక్షలు
- ఇద్దరు నిర్వాహకులు అదుపులో



మిగతాది 2లో

## హైదరాబాద్‌లో జనసేన

# ఎంపీ కుమారుడిపై కేసు




**హైదరాబాద్:**
జనసేన ఎంపీ లింగమనేని రమేశ్ కుమారుడు సంజూష్‌పై హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 16న ఇనార్బిట్ మాల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భారతి (26) అనే యువతి మృతిచెందింది. ఇనార్బిట్ మాల్‌లోని లైఫ్‌స్టైల్ స్టోర్‌లో పనిచేస్తున్న ఆమె.. రోడ్డు దాటుతుండగా సంజూష్ అతివేగంగా కారు నడుపుతూ ఆమెను ఢీకొట్టినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అతడిపై బీఎన్ఎస్ సెక్షన్ 106(1) కింద కేసు నమోదు చేశారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం ఆగస్ట్ 21, 2026

# కారంలో 30% చెక్కపొడి!

మొదటిపేజీ తరువాయి
మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో కల్తీ మసాలా తయారీ కేంద్రంపై ఎస్‌వోటీ పోలీసులు, ఆహార కల్తీ పర్యవేక్షణ బృందాలు సంయుక్తంగా దాడులు చేశాయి. మేడిపల్లి శ్రీనివాస్‌నగర్ కాలనీలోని సాయి తిరుమల ఎంటర్‌ప్రైజెస్‌పై పోలీసులు దాడి చేసి తనిఖీలు చేపట్టారు. అపరిశుభ్ర వాతావరణంలో పసుపు, కారం, ధనియాల పొడి, గరం మసాలా తయారీ చేస్తున్నట్లు గుర్తించారు.కారం పొడిలో ఏకంగా 30 శాతం చెక్క పొడి కలిపినట్లు.. స్వదేశీ స్వస్తిక్ బ్రాండ్ పేరుతో డూప్లికేట్ ప్యాకింగ్, లేబులింగ్ చేసినట్లు నిర్ధరించారు. ఒరిజినల్ బ్రాండ్‌ను పోలిన ప్యాకెట్లలో కల్తీ కారం పొడి విక్రయానికి సిద్ధం చేసినట్లు గుర్తించారు. వీటిని వివిధ వాణిజ్య సంస్థలు, వినియోగదారులకు సరఫరా చేస్తున్నట్లు తేల్చారు. మొత్తం 10,890 కిలోల కల్తీ ఆహార పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.25లక్షలు ఉంటుందని అంచనా. ఈ ఘటనలో నిర్వాహకులు సత్యనారాయణ, రుద్రశేఖర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# సోనియా ఆత్మకథ.. రాహుల్ భావోద్వేగ పోస్ట్

మొదటిపేజీ తరువాయి
సోనియా తన జీవిత ప్రయాణంపై రాసిన ఆత్మకథను నాఫ్ ప్రచురణ సంస్థ నవంబరు 10న హార్డ్‌కవర్, ఈ-బుక్ రూపంలో విడుదల చేయనుంది. దీని ఆడియో ఎడిషన్‌ను పెంగ్విన్ రాండమ్ హౌస్ అందుబాటులోకి తీసుకురానుంది. తొలి ముద్రణలో లక్ష కాపీలను ముద్రించనున్నట్లు ప్రచురణకర్త తెలిపారు. మరోవైపు తన జీవితంలో జరిగిన కీలక ఘట్టాలు, విషయాలను పుస్తకంలో పంచుకున్నట్లు సోనియా తెలిపారు. ఇందులో రాజీవ్ గాంధీతో ప్రేమ, పెళ్లి వంటి విషయాలను పేర్కొన్నట్లు వెల్లడించారు. రాజకీయాల్లోకి రావడం, అందుకు దారితీసిన పరిస్థితులను పంచుకున్నట్లు ఆమె వివరించారు. తన కుటుంబం గురించే ఎక్కువగా ప్రస్తావించినట్లు తెలిపారు. ఇంకా ఎన్నో అంశాలను ఆమె అందులో పంచుకున్నారు. 'నా జీవితాన్ని రాయడం అంత సులభంగా అనిపించలేదు. లోపలే దాచుకున్న అనుభవాలను బయటపెట్టాల్సి వచ్చింది" అని సోనియా తెలిపారు.

# సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం.. నన్ను బాధ్యురాలిని చేయొద్దు: కొండా సురేఖ

మొదటిపేజీ తరువాయి
టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ (డీఏసీ) ఇచ్చిన షోకాజ్ నోటీసులపై మంత్రి కొండా సురేఖ స్పందించారు. ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో డీఏసీ వివరణ కోరిన విషయం తెలిసిందే. దీంతో కొండా సురేఖ స్పందిస్తూ క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చారు. ఈ మేరకు కమిటీ ఛైర్మన్ మల్లు రవికి లేఖ రాశారు.
పరకాల నుంచే పోటీ చేస్తా.. సీఎం రేవంత్ లక్ష్యంగా సుస్మితా విమర్శలు
"నా కుమార్తె వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలు. సుస్మిత వ్యాఖ్యల వ్యవహారంలో నా ప్రమేయం లేదని గుర్తించాలి. సుస్మిత వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయడం సరికాదు. నాకు సంబంధం లేని అంశంలో నా వివరణ కోరడం సముచితం కాదు. కాంగ్రెస్ నాయకత్వం, పార్టీ నియమావళిపై నాకు గౌరవముంది. షోకాజ్ నోటీసును ఉపసంహరించుకోవాలి"అని కొండా సురేఖ పేర్కొన్నారు.

# కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

మొదటిపేజీ తరువాయి
"కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండిస్తున్నా. మంత్రి కొండా సురేఖ ఎన్నోఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నారు. కుమార్తె వ్యాఖ్యలపై ఆమె వివరణ కోరాం. నిన్ననే షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చాక ఏం చేయాలో ఆలోచిస్తాం. పోచారం శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యలపై ఆయనతో మాట్లాడాం. పోచారం ఆవేదనను అర్థం చేసుకున్నాం. ఎవరికి టికెట్ ఇవ్వాలో ఎన్నికల కమిటీ, సీడబ్ల్యూసీ నిర్ణయం తీసుకుంటుంది. ఎవరికి వారు పోటీ చేస్తామని ప్రకటించడం సరికాదు. 22ఏపై బీఆర్ఎస్ అనవసర రాద్ధాంతం చేస్తోంది. కిందిస్థాయిలో జరిగిన తప్పిదాలను సరిదిద్దాలని సీఎం అధికారులను ఆదేశించారు" అని మహేశ్‌గౌడ్ తెలిపారు.

# వచ్చే ఎన్నికలకు భూ భారతి రెఫరెండం!

మొదటిపేజీ తరువాయి
ప్రతి జిల్లాలో నేరుగా సమస్యల పరిష్కారం.. తానే స్వయంగా అన్ని జిల్లాలకు వెళు తానన్నారు. భూభారతి చట్టం ద్వారా పేదలకు మేలు జరుగుతుందని, ఇది ప్రారంభించినప్పుడే చెప్పానని, ఇప్పుడు కూడా అదే మాట చెబుతున్నానన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు భూభారతిని రెఫరెండమన్నారు మంత్రి.(గురువారం, ఆగస్టు 20వ తేదీ) సత్తుపల్లి మండలం బేతుపల్లి రెవెన్యూ పరిధిలో నారాయణపురం గ్రామంలో భూభారతి భూ రీ సర్వే అవగాహన సదస్సులో భాగంగా రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు మంత్రి శ్రీనివాసరెడ్డి,'ఇది పేదవాడి కష్టం తెలిసిన ప్రజా ప్రభుత్వం. ప్రతిపక్షాల విమర్శలకు భయపడేది లేదు. 22-ఏ ద్వారా అక్రమ ఆస్తులను రెగ్యులరైజేషన్ చేసుకోవాలన్న కొందరి తపన కలగానే మిగిలిపోతుంది. ఈ ప్రభుత్వ చిత్తశుద్ధి, నిబద్ధత ఏంటో ప్రజలందరికీ తెలుసు. అక్రమంగా సంపాదించిన ఆస్తులపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 'ఎస్ఈటీ'ని ఏర్పాటు చేసింది.కుటుంబ సభ్యులను ముందుపెట్టి డ్రామాలు చేసే బదులు..రాజకీయాన్ని రాజకీయంగా ఎదుర్కోవాలి. ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ఉద్దేశపూర్వకంగా విష ప్రచారం చేస్తున్నాయి. ప్రజలను మభ్యపెట్టేలా సొల్లు పురాణాలు చెప్పడం ఇకనైనా బంద్ చేయాలి. ఇది పేదవాడి కష్టం తెలిసిన, పేదలకు అండగా నిలిచే ప్రజా ప్రభుత్వం. రాబోయే ఎన్నికల్లో ఇదే ప్రభుత్వానికి ప్రజలు మరోసారి తీర్పునిచ్చి తమ రెఫరెండం చూపుతారు.' అని ధీమా వ్యక్తం చేశారు.

# బైక్‌పై సీపీ సజ్జనార్!

మొదటిపేజీ తరువాయి
అగ్రసేన్ చౌరస్తా, ఫిల్మ్‌నగర్ జంక్షన్ మీదుగా తిరిగి రోడ్డు నంబర్ 45 వరకు రెండు సార్లు బైక్‌పై తిరుగుతూ ట్రాఫిక్‌ను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నం వేళల్లో కూడా మరోసారి ట్రాఫిక్ సరళిని పర్యవేక్షించారు. అగ్రసేన్ చౌరస్తా, ఫిల్మ్‌నగర్, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీ చెక్‌పోస్ట్, కేబీఆర్ పార్కు ప్రధాన గేటు తదితర కూడళ్ల వద్ద విధుల్లో ఉన్న పోలీసులతో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా సీపీ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ.. కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే ట్రాఫిక్ సాఫీగా సాగుతోందన్నారు. బుధవారం నుంచి వన్‌వే విధానాన్ని అమలులోకి తెచ్చామని.. మొదటి రోజు లేన్ల మార్పిడి విషయంలో వాహనదారులు కాస్త అయోమయానికి గురైనప్పటికీ, గురువారం నాటికి రాకపోకలు పూర్తిగా సాఫీగా సాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జంక్షన్లలో స్పష్టమైన సైన్‌బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు తగినంత మంది సిబ్బందిని కూడా మోహరించినట్లు వివరించారు.జీహెచ్ఎంసీ, నిర్మాణ ఏజెన్సీతో సమన్వయం చేసుకుంటూ హెచ్-సిటీ ప్రాజెక్టు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పనులు పూర్తయ్యేంత వరకు నగరవాసులు సహకరించాలని, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ సూచనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు.

# సామాన్యుడిలా బైక్‌పై వచ్చి.. సీపీ సజ్జనార్ ఏం చేశారంటే..?




చెన్నై: కేంద్రహోంమంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలో తమిళనాడులోని మామల్లపురం (మహాబలిపురం)లో దక్షిణ మండలి (సదరన్ కౌన్సిల్) సమావేశం కొనసాగుతోంది. ఈ సమావేశానికి ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం విజయ్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, కేరళ సీఎం సతీశన్, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, మిగిలిన ముఖ్యమంత్రులు కలుసుకున్నారు.దీనికి సంబంధించిన ఫొటోలను ఏపీ సీఎం కార్యాలయం 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. ఈ సమావేశంలో దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించిన కీలక అంశాలు, కేటాయింపులు, ఇతర అంశాలపై చర్చించారు. ప్రధానంగా నీట్ వివాదం, కావేరి జలాలు, నియోజకవర్గాల పునర్విభజనపై తమ అభ్యంతరాలను దక్షిణాది రాష్ట్రాల సీఎంలు అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లారు.

# 'తప్పుగా మాట్లాడాను'.. ఆర్మీకి 'జెన్ జీ' యువతి క్షమాపణ



లద్దాఖ్‌లో సైనిక సిబ్బందితో ఓ యువతి వాగ్వాదానికి దిగిన వీడియో వైరల్ అయిన విషయం తెలిసిందే. ద్రాస్ ప్రాంతంలోని మినామార్గ్ చెక్‌పోస్ట్ వద్ద జరిగిన ఈ ఘటనపై ఆమె భారత సైన్యంతోపాటు జమ్మూకశ్మీర్, లద్దాఖ్ పోలీసులకు క్షమాపణలు చెప్పారు. ఆ రోజు గంటల తరబడి తమను ఎందుకు ఆపుతున్నారో తెలియక ఫ్రస్ట్రేషన్‌లో అలా మాట్లాడానని ఓ వార్తాసంస్థకు తెలిపారు. సాయుధ దళాలను అవమానించాలనో లేదా పాపులర్ అవ్వాలనో అనుకోలేదని.. తన వ్యాఖ్యలపై చింతిస్తున్నట్లు పేర్కొన్నారు.
"నేనో సాధారణ అమ్మాయిని. సైన్యాన్ని ఎంతగానో గౌరవిస్తాను. నా మాటల వల్ల వారికి బాధ కలుగుతుందని ఎప్పుడూ అనుకోలేదు. ఆ రోజు మేం లద్దాఖ్ నుంచి దిల్లీకి బయల్దేరాం. మార్గమధ్యంలో వీఐపీ రాకపోకలు ఉంటాయని తెలియదు. దీంతో గంటల తరబడి అక్కడే నిలిచిపోయాం. చివరకు విసుగెత్తి పోయాం. ఏదేమైనా నేను తప్పుగా మాట్లాడాను. విషయం ఇంత పెద్దదవుతుందని ఊహించలేదు. జరిగినదానికి అందరికీ, ముఖ్యంగా జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లాకు క్షమాపణలు చెబుతున్నాను. 'జెన్‌జీ' అనే మాటలు కూడా అనుకోకుండానే వచ్చేశాయి. ఈ వ్యవహారంపై పెద్దఎత్తున విమర్శలు రావడం బాధించింది" అని తెలిపారు.
లద్దాఖ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ వీడియో గత నెల 26న 'కార్గిల్ విజయ్ దివస్' నాటిది. భద్రతా కారణాల దృష్ట్యా ఆ రహదారిని తాత్కాలికంగా మూసివేశారు. భద్రత, ప్రతికూల వాతావరణం, రోడ్డు పరిస్థితుల కారణంగా మినామార్గ్- జోజిలా మార్గంలో వాహనాల రాకపోకలను నియంత్రించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌లో భూకంపం..

## తన వ్యాఖ్యలపై సుస్మితా పటేల్ వివరణ

మొదటిపేజీ తరువాయి
కాంగ్రెస్ హై కమాండ్‌పై తనకు నమ్మకం ఉందని తెలిపారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ అంటే గౌరవమని చెప్పారు.కాగా, రేవంత్ రెడ్డిపై సుస్మిత చేసిన వ్యాఖ్యలు కలకలం రేపిన విషయం తెలిసిందే. అంతకుముందు, రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలతో పార్టీలో ఒక్కసారిగా మంటలు రేగాయి. మళ్లీ పరకాల ఎమ్మెల్యేగా రేవూరి ప్రకాశ్‌రెడ్డిని ఆశీర్వదించాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.దీంతో కొండా సుస్మితా పటేల్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పరకాల ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉంటానని స్పష్టం చేశారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డితో రేవంత్‌రెడ్డి రాజీనామా చేయించి ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోయినా తాను పరకాల నుంచి స్వతంత్రంగా పోటీ చేస్తానని ప్రకటించారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి.

# ట్రంప్‌ది 'ఆర్థిక ఉగ్రవాదం'.. ఓటమి తప్పదు: ఇరాన్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ దేశంపై ఆర్థిక యుద్ధం ప్రకటించడాన్ని ఇరాన్ తీవ్రంగా ఖండించింది. భారీగా అప్పులు, విపరీతంగా పెరుగుతున్న వడ్డీ ఖర్చుల వంటి స్వీయ సంక్షోభాల నుంచి దృష్టి మళ్లించే చర్యగా దీనిని పేర్కొంది. విఫలమైన విధానాలను కొనసాగించడం వల్ల ముమ్ముందు కూడా ఓటమిని, ఇరాన్ ప్రజల శత్రుత్వాన్ని మూటగట్టుకోవడం తప్ప ఏమీ సాధించలేరని తెలిపింది.
అమెరికా 'ఆర్థిక ఉగ్రవాదం'.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, సార్వభౌమాధికారానికి ముప్పు కలిగిస్తుందని ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. అమెరికా అప్పులు 40 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నాయని సూచించే మీడియా నివేదికలను ఆయన ప్రస్తావించారు. ఆర్థిక క్రమశిక్షణను పునరుద్ధరిస్తానని అధ్యక్షుడు ట్రంప్ హామీ ఇచ్చినప్పటికీ.. ఆయన అనుసరించిన అనేక విధానాలు రుణ భారాన్ని మరింత పెంచాయని అవి పేర్కొన్నాయి.
ఇరాన్ ను ఆర్థికంగా దెబ్బతీయడమే లక్ష్యంగా ట్రంప్ కీలక ప్రకటన చేసిన విషయం తెలిసిందే. ఇరాన్‌కు సాయం చేసే దేశాలు ఆర్థికంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇరాన్ ముప్పును ఎదుర్కోడానికి, దాన్ని ఏకాకిని చేసి, ఓడించడానికి మిత్రదేశాలన్నీ తమతో కలిసి నిలబడాలని పిలుపునిచ్చారు. ఆ దేశం ఎప్పటికీ అణ్వాయుధం కలిగి ఉండకూడదని 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ పెట్టారు.

# ఆ దేశంలో పాక్ ప్రయాణికులపై వివక్ష..! ఎంపీ అసద్ ఖైసర్



విమానం రద్దు కావడంతో యూఏఈ లో హోటల్ వసతి కోరిన పాకిస్థానీ ప్రయాణికుల పట్ల వివక్ష చూపారని ఆ దేశ ఎంపీ అసద్ ఖైసర్ ఆరోపించారు. ఈ విషయాన్ని ఆయన ఆ దేశ నేషనల్ అసెంబ్లీలో ప్రస్తావించారు. విమానం రద్దు కావడంతో తాను కూడా హోటల్‌లో బస చేసేందుకు ప్రయత్నించానని చెప్పారు. అయితే పాకిస్థానీయుల పట్ల హోటల్ సిబ్బంది వ్యవహరించిన తీరు సరిగా లేదన్నారు. భారత్, అమెరికా పాస్‌పోర్టులు ఉన్న ప్రయాణికులకు మాత్రమే వసతి కల్పిస్తామని అక్కడ ఏర్పాటు చేసిన ప్రకటనలో పేర్కొన్నారని తెలిపారు. ఇలాంటి వ్యవహారంపై యూఏఈ అధికారులతో దౌత్య మార్గాల్లో చర్చించాలని పాక్ విదేశాంగ శాఖను కోరారు.యూఏఈ తమకు సోదర దేశమని ఖైసర్ పేర్కొన్నారు. ఆ దేశ అభివృద్ధిలో పాకిస్థానీయులు గణనీయమైన పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ఇలాంటి ఘటనలు ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తనను కలిసిన ఓ ప్రతినిధి బృందం కూడా ఇలాంటి అనుభవాలపై ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఈ ఘటనపై యూఏఈ అధికారులు అధికారికంగా స్పందించలేదు.

# బంగ్లాదేశ్ నూతన అధ్యక్షుడిగా మీర్జా ఫఖ్రుల్



బంగ్లాదేశ్ నూతన అధ్యక్షుడిగా మీర్జా ఫఖ్రుల్ ఇస్లాం అలంగీర్ (78) ఎన్నికయ్యారు. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ సెక్రటరీ జనరల్‌గా పనిచేసిన ఆయనకు 255 మంది పార్లమెంటు సభ్యుల మద్దతు లభించినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఆగస్టు 21న నూతన అధ్యక్షుడిగా ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు. అయితే, 35 ఏళ్ల అనంతరం దేశ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగడం గమనార్హం.
అధ్యక్ష ఎన్నికల్లో భాగంగా మొత్తం 349 మంది చట్టసభ సభ్యులు రిజిస్టర్ చేసుకోగా.. 343 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆరుగురు మాత్రం పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. లిబరల్ డెమొక్రటిక్ పార్టీ ఛైర్మన్, విపక్ష కూటమి అభ్యర్థి రిటైర్డ్ కర్నల్ ఓలి అహ్మద్‌కు 88 ఓట్లు వచ్చాయి.
బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు అత్యంత సన్నిహితుడిగా పేరున్న మొహ్మద్ షాబుద్దీన్.. అధ్యక్ష పదవికి ఇటీవల రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఐదేళ్ల పదవీకాలం పూర్తి కాకముందే బాధ్యతల నుంచి వైదొలిన ఆయన.. ఆరోగ్య సమస్యలను కారణంగా చెప్పారు.

# రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిన కామారెడ్డి జిల్లా రాజంపేట్ ఎస్ఐ !




కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎన్జీవోస్ కాలనీలో 30 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రాజంపేట్ ఎస్ఐ ఆంజనేయులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డాడు. సిమెంట్ దుకాణం విషయంలో సిద్ధిరాములు అనే వ్యక్తి నుంచి ఎస్ఐ ఆంజనేయులు 50 వేల రూపాయలు డిమాండ్ చేశాడు.
ముందుగా సిద్ధిరాములు వద్ద నుంచి 20 వేల రూపాయలు తీసుకున్నాడు. గురువారం మధ్యాహ్నం కామారెడ్డి ఎన్జీవోస్ కాలనీలోని ఎస్సై నివాసంలో మరో 30 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్?గా పట్టుకున్నారు. ఎస్సై నివాసంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేశారు. కేసుకు సంబంధించి వివరాలపై ఏసీబీ అధికారులు విచారణ కొనసాగించారు.
హైదరాబాద్ సిటీలో కూడా ఈ తరహాలోనే GHMC టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ లంచం తీసుకుంటూ దొరికిపోయింది. బిల్డింగ్ పర్మిషన్ ఫైల్ ప్రాసెస్ చేసేందుకు లంచం తీసుకుంటూ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ ప్రభావతి ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్?గా పట్టుబడ్డారు.చాంద్రాయణగుట్ట నర్కి పూల్ బాగ్ జోనల్ కార్యాలయంలో రూ.20 వేల లంచం తీసుకుంటుండగా అధికారులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. సంతోష్ నగర్ సర్కిల్--25 పరిధిలో బిల్డింగ్ పర్మిషన్ ఫైల్ ప్రాసెస్ చేసి, బిల్డింగ్ పర్మిట్ ఆర్డర్, వర్క్ కమాన్స్మెంట్ లెటర్ ఇచ్చేందుకు ప్రభావతి లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు చెప్పారు.

# హర్మూజ్‌లో అమెరికా రహస్య షిప్పింగ్ కారిడార్

హర్మూజ్ జలసంధిలో అమెరికా సైన్యం రహస్య షిప్పింగ్ కారిడార్‌ను నిర్వహిస్తోంది. దీని నుంచి గుట్టుగా నౌకలను జలసంధి దాటిస్తున్నట్లు అమెరికా పత్రిక కథనం ప్రచురించింది. కాల్పుల విరమణ కొనసాగించేందుకు ట్రంప్ నిరాకరించిన నేపథ్యంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.కొన్ని వారాల నుంచి అమెరికా దళాలు రాత్రి సమయంలో రహస్యంగా 15-20 వరకూ ట్యాంకర్లను సురక్షితంగా హర్మూజ్‌ను దాటిస్తున్నాయి. ఒమన్ తీరానికి సమీపంలోని దక్షిణ ఛానెల్ మార్గాన్ని దీనికి వినియోగిస్తున్నాయి. ఈ లెక్కన రోజుకు కనీసం కోటి బ్యారెళ్ల చమురు అందుబాటులోకి వస్తోంది. యుద్ధానికి ముందు సరఫరా అయ్యే చమురులో ఇది సగానికి సమానం. దీంతోపాటు ఖాళీ ట్యాంకర్లు తిరిగి గల్ఫ్ దేశాల్లో రేవులకు వెళ్లి చమురు నింపుకొని వచ్చేందుకు అమెరికా సైన్యం సాయం చేస్తోంది. ఈ మొత్తం ఆపరేషన్‌ను అమెరికాలోని నార్త్ కరోలినా ఫోర్ట్ బ్రాగ్‌లోని అమెరికా టాస్క్ ఫోర్స్ సమన్వయం చేస్తోంది.

# నాగమయ్య గుడి లైన్‌లో డ్రైనేజీ శుభ్రత పనులు ప్రారంభం

కరపత్రం ప్రతినిది వరంగల్,ఆగస్టు 20



41వ డివిజన్ పరిధిలోని నాగమయ్య గుడి లైన్‌లో మున్సిపల్ పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయి.కార్పొరేటర్ పోషాల పద్మ,పోషాల స్వామి ఆధ్వర్యంలో డ్రైనేజీ శుభ్రపరిచే పనులను ప్రారంభించారు.ప్రాంతంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు మురుగు నీరు కాలువలో సాఫీగా వెళ్లేలా జెసిబి తో డ్రైనేజీలను శుభ్రం చేస్తున్నారు.డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త,వ్యర్థాలను తొలగించి నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చర్యలు చేపడుతున్నారు.ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వాతావరణం కల్పించడమే లక్ష్యంగా మున్సిపల్ సిబ్బంది పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

# మిలాద్ ఉన్ నబీ సందర్భంగా వైద్య సేవల్లో 50% రాయితీ

- న్యూ వరంగల్ హాస్పిటల్‌లో వైద్య అవగాహన సదస్సు
- ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలి: డాక్టర్ గులాం రెహ్మాన్ షరీఫ్




కరపత్రం ప్రతినిది వరంగల్, ఆగస్టు 20

ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించి తగిన చికిత్స పొందాలని న్యూ వరంగల్ హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ జనరల్ సర్జన్ డాక్టర్ గులాం రెహ్మాన్ షరీఫ్, ఎం.ఎస్. సూచించారు. మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకుని 'న్యూ వరంగల్ హాస్పిటల్''లో నిర్వహించిన వైద్య అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రజలకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గులాం రెహ్మాన్ షరీఫ్ మాట్లాడుతూ.. కడుపునొప్పి, జ్వరం, వాంతులు, జీర్ణ సంబంధిత సమస్యలు తదితర లక్షణాలు కనిపించినప్పుడు వాటిని సాధారణ సమస్యలుగా భావించి నిర్లక్ష్యం చేయరాదన్నారు. సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, సమర్థవంతమైన చికిత్స అందించవచ్చని తెలిపారు.

మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రత్యేక రాయితీలు

మిలాద్ ఉన్ నబీ సందర్భంగా న్యూ వరంగల్ హాస్పిటల్‌లో స్కానింగ్‌తో పాటు ఇతర వైద్య సేవలపై 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు డాక్టర్ తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక అవకాశాన్ని అందిస్తున్నామని, అవసరమైన వారు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్ని రకాల శస్త్రచికిత్సలకు నాణ్యమైన సేవలు

న్యూ వరంగల్ హాస్పిటల్‌లో సాధారణ శస్త్రచికిత్సలు, ల్యాపరోస్కోపిక్ శస్త్రచికిత్సలు, ప్రమాద గాయాల చికిత్సతో పాటు వివిధ ఆరోగ్య సమస్యలకు నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నామని ఆయన వివరించారు. అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో రోగులకు అవసరమైన వైద్య సలహాలు, పరీక్షలు, చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

చిన్నపాటి ఆరోగ్య సమస్యగా కనిపించినా నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో తీవ్ర అనారోగ్యానికి దారితీసే అవకాశం ఉందని పేర్కొన్న ఆయన.. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వ్యాధిని ముందుగానే గుర్తించి సరైన సమయంలో చికిత్స పొందితే ఆరోగ్యపరమైన ఇబ్బందులను అధిగమించవచ్చని తెలిపారు. వైద్య సలహాలు, సంప్రదింపుల కోసం: 85209 58610

# రైల్వే జీఎం చేత ఎంపీ రవిచంద్రకు ఘన సత్కారం

- సికింద్రాబాద్‌లో ఎంపీల సమావేశం.. పుష్పగుచ్ఛం, శాలువాతో సాదర స్వాగతం



కరపత్రం ప్రతినిది సికింద్రాబాద్, ఆగస్టు 20

బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఘనంగా సత్కరించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో గురువారం దక్షిణ మధ్య రైల్వే జోనల్ పరిధిలోని పార్లమెంట్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సాదర స్వాగతం పలికారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రైల్వే జోన్ పరిధిలోని అభివృద్ధి పనులు, ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదల, పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యలు తదితర అంశాలపై పార్లమెంట్ సభ్యులతో చర్చించారు. సమావేశంలో ఎంపీలు తమ తమ ప్రాంతాలకు సంబంధించిన రైల్వే అభివృద్ధి అవసరాలు, కొత్త సౌకర్యాల ఏర్పాటు, ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు తీసుకోవాల్సిన చర్యలను రైల్వే అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

# బూర ముత్తిలింగంకు నివాళు లర్పించిన :ఎంపీ రవిచంద్ర

కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 20



బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తోడల్లుడు (సడ్డకుడు)బూర ముత్తిలింగం (బాబూరావు) గతేడాది ఆగస్ట్ 2వతేదీన పరమ పదించారు.ఈ సందర్భంగా దివంగత ముత్తిలింగం ప్రథమ వర్ధంతి (సంవత్సరీకం) చార్ బౌలిలోని ఎంఎస్ఎ ఫంక్షన్ హాలులో గురువారం జరిగింది.ఈ కార్యానికి వద్దిరాజు కిషన్-శశిరేఖ,వద్దిరాజు దేవేందర్-ఇందిర,వద్దిరాజు-విజయలక్ష్మి,వద్దిరాజు వెంకటేశ్వర్లు-పద్మ,వద్దిరాజు అఖిల్,గూడ రాజేష్,గూడ సతీష్,వేం రాంచంద్రారెడ్డి,బూర సురేష్,బూర రమేష్,రంగరాజు దయాకర్ తదితరులు హాజరై స్వర్గీయ ముత్తిలింగం చిత్రపటానికి పూల మాల వేసి పూలుజల్లి శ్రద్ధాంజలి ఘటించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి

కరపత్రం ప్రతినిది వరంగల్,ఆగస్టు 20

ట్రైసిటీ పరిధిలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత,ఐపీఎస్ సూచించారు.గురువారం ఆమె ఆధ్వర్యంలో ప్రత్యేక ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఎన్‌హెచ్ఏఐ పీడీ భరద్వాజ్‌తో పాటు ఆర్అండ్‌బీ,మున్సిపల్,ట్రాఫిక్‌పోలీస్ శాఖల అధికారులు హాజరయ్యారు.159 ప్రాంతాల్లో వెలుతురు సమస్య నగరంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకునే బ్లాక్‌స్పాట్లను ట్రాఫిక్ పోలీసులు గుర్తించి, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్ సిగ్నళ్ల పనితీరు,వరంగల్,హన్మకొండ,కాజీపేట ప్రాంతాల్లో కొత్తగా సిగ్నల్స్ ఏర్పాటు చేయాల్సిన జంక్షన్లు,రోడ్ల ఆక్రమణలు,తొలగించాల్సిన విద్యుత్, టెలిఫోన్ స్తంభాలు,పార్కింగ్ స్థలాలు,రోడ్డు మరమ్మతులు తదితర




అంశాలపై చర్చించారు. యూ-టర్నింగ్ ప్రాంతాల్లో సోలార్ బ్లింకర్లు ఏర్పాటు చేయడం,ఆటో స్టాండ్లకు అనువైన ప్రాంతాలను గుర్తించడం వంటి అంశాలను కూడా పరిశీలించారు.ట్రైసిటీ పరిధిలో రాత్రి సమయాల్లో తగినంత వెలుతురు లేని 159 ప్రాంతాలను గుర్తించినట్లు సీపీ తెలిపారు.ఆయా ప్రాంతాల్లో వీధి దీపాల ఏర్పాటుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సీపీ ఎన్.శ్వేత అధికారులకు సూచించారు.ప్రమాదకర ప్రాంతాలు,ప్రధాన కూడళ్లు,రోడ్డు మలుపులు,అనధికార పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రమాదాలు జరిగే అవకాశమున్న ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సంయుక్త పరిశీలన గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ.. ట్రాఫిక్ పోలీసులు సూచించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.పోలీస్,మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిశీలిస్తే ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలను మరింత సమర్థంగా గుర్తించవచ్చని పేర్కొన్నారు.సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత,హన్మకొండ ఏసీపీ నర్సింహారావు, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణతో పాటు ట్రాఫిక్ అధికారులు,ట్రైసిటీ పరిధిలోని పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు,ఐటీ కోర్, టీఎస్ఐ అధికారులు, మున్సిపల్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 22ఏ నిషేధిత జాబితాపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన తెలంగాణ రక్షణ సేన

- ప్రైవేట్ ఆస్తుల విషయంలో పారదర్శకత పాటించాలని డిమాండ్
- తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు గొంగళ్ల రంజిత్

కరపత్రం ప్రతినిది హైదరాబాద్, ఆగస్టు 20

22ఏ నిషేధిత జాబితా అమలు వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి వివరాలతో స్పందించాలని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు గొంగళ్ల రంజిత్ డిమాండ్ చేశారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.22ఏ నిషేధిత జాబితాలో ప్రైవేట్ ఆస్తులు చేరడం వల్ల పలువురు భూ యజమానులు ఆందోళనకు గురవుతున్నారని రంజిత్ అన్నారు. ప్రజల ఆస్తుల హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంటూ, అలాంటి అంశాల్లో స్పష్టత, పారదర్శకత




ఉండాలని కోరారు. నిషేధిత జాబితాలో ప్రైవేట్ భూములను చేర్చేందుకు అనుసరించిన విధివిధానాలను ప్రభుత్వం ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం కారణంగా ఆస్తుల కొనుగోలు, విక్రయాలు, రిజిస్ట్రేషన్లలో సమస్యలు ఎదురవుతున్నాయని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు అన్యాయం జరిగితే బాధితుల తరఫున తెలంగాణ రక్షణ సేన ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. 22ఏ అంశంపై ప్రభుత్వంలోని వివిధ మంత్రులు వేర్వేరు వ్యాఖ్యలు చేయడం ప్రజల్లో మరింత గందరగోళానికి దారితీస్తోందని రంజిత్ అన్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం ఏకీకృతంగా, అధికారికంగా తన వైఖరిని ప్రకటించాలని కోరారు. ఒకవేళ అమలులో లోపాలు జరిగి ఉంటే వాటిపై సమగ్ర విచారణ నిర్వహించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భూ రికార్డులు, నిషేధిత జాబితా అంశాల్లో ప్రజలకు నష్టం జరగకుండా ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. 22ఏ నిషేధిత జాబితా కారణంగా సామాన్య ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించాలని రంజిత్ కోరారు. ప్రజల ఆస్తి హక్కులను కాపాడే విధంగా స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసి, అవసరమైతే నిషేధిత జాబితాను సమీక్షించాలని ప్రభుత్వాన్ని టీఆర్ఎస్ నాయకులు రంజిత్ విజ్ఞప్తి చేశారు.

# ఉద్యోగమే లక్ష్యం.. యువతకు ఉచిత శిక్షణే టీఆర్ఎస్ సంకల్పం

- నిపుణుల అధ్యాపకులతో నాణ్యమైన బోధన అందిస్తున్నాం
- యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: టీఆర్ఎస్ గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు

కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 20

నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో అండగా నిలుస్తూ తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ హనుమకొండలో ఉచిత కానిస్టేబుల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. నాణ్యమైన బోధన, శారీరక సాధన, అధ్యయన సామగ్రిని ఉచితంగా అందిస్తూ యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే దిశగా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితమ్మ సూచనల మేరకు గ్రేటర్ వరంగల్ జిల్లా టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో హనుమకొండలోని పాత్‌ఫైండర్ ప్రవేశ పరీక్షల కళాశాలలో ఉచిత కానిస్టేబుల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణ ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు



కొనసాగనుంది.

ఈ సందర్భంగా టీఆర్ఎస్ రాష్ట్ర నేత డాక్టర్ వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ.. ఉద్యోగం కోసం సిద్ధమవుతున్న యువతకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ తీవ్రమవుతున్న నేపథ్యంలో సరైన ప్రణాళిక, క్రమశిక్షణ, నిపుణుల శిక్షణ ఉంటే విజయం సాధించడం సాధ్యమేనని అన్నారు.

కానిస్టేబుల్ నియామక పరీక్షలకు అవసరమైన అన్ని అంశాలపై సమగ్ర శిక్షణతో పాటు శారీరక దారుఢ్యానికి



ప్రత్యేక గ్రౌండ్ సాధన, వారానికోసారి నమూనా పరీక్షలు, అధ్యయన సామగ్రి, నిపుణుల మార్గదర్శకత్వం అందిస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణను పూర్తిగా ఉచితంగా నిర్వహించడం ద్వారా ప్రతిభావంతులైన నిరుపేద యువతకు చేయూత అందించడం తమ లక్ష్యమని స్పష్టం చేశారు. యువత ప్రభుత్వ ఉద్యోగాలను సాధించి కుటుంబాలకు, సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తూ, ఈ అవకాశాన్ని ప్రతి అభ్యర్థి వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా నాయకులు ఎస్. కిషోర్, ఏ. లత, పి. సుతేజ్, డి. గణేష్, వి. నిశాంత్ రావు, ఎల్.ఎస్. నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ చూపిన అభివృద్ధి బాటే నేటి భారతానికి దిక్సూచి

- 82వ జయంతి సందర్భంగా.. హనుమకొండలో అయ్యాల రాంరెడ్డి ఘన నివాళులు
- హనుమకొండ డిసిసి కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు అయ్యాల రాంరెడ్డి

కరపత్రం ప్రతినిది బ్యూరో, ఆగస్టు 20

దేశాన్ని 21వ శతాబ్దం వైపు నడిపించిన దూరదృష్టి గల నాయకుడు, ఆధునిక భారత రూపశిల్పి, మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ చూపిన అభివృద్ధి బాటే నేటి భారతానికి దిక్సూచిగా నిలిచిందని హనుమకొండ డిసిసి కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు అయ్యాల రాంరెడ్డి పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ 82వ జయంతిని పురస్కరించుకొని గురువారం హనుమకొండలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ముందుగా హనుమకొండ జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించిన అనంతరం, హనుమకొండ డిసిసి భవన్‌లో ఏర్పాటు



చేసిన స్మారక సభలో కాంగ్రెస్ నాయకులతో కలిసి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా అయ్యాల రాంరెడ్డి మాట్లాడుతూ.. భారతదేశంలో సమాచార సాంకేతిక విప్లవానికి శ్రీకారం చుట్టి, యువతకు అపార అవకాశాలను కల్పించిన మహానేత రాజీవ్ గాంధీ అని కొనియాడారు. టెలి కమ్యూనికేషన్, కంప్యూటరీకరణ, స్థానిక సంస్థల బలోపేతం, యువశక్తికి ప్రాధాన్యత వంటి సంస్కరణలతో దేశ అభివృద్ధికి ఆయన వేసిన



పునాదుల ఫలితాలనే నేడు భారతదేశం అనుభవిస్తోందన్నారు. ప్రజాస్వామ్య విలువలు, లౌకికవాదం, సామాజిక న్యాయం, అభివృద్ధి అనే నాలుగు స్తంభాలపై రాజీవ్ గాంధీ నిర్మించిన భావజాలాన్ని భావితరాలకు చేర్చాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధి, ప్రతి కాంగ్రెస్ నాయకుడు, ప్రతి కార్యకర్తపై ఉందని ఆయన పేర్కొన్నారు. దేశ ప్రగతికి రాజీవ్ గాంధీ అందించిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోలేపల్లి రవి, శ్రీపతి చేరాలు, కొప్పుల సంపత్, ఆరెల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ పాత్ర చిరస్మరణీయం

- ఐనవోలు మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు
- ఐనవోలు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్

కరపత్రం ప్రతినిది ఐనవోలు, ఆగస్టు 20

దేశాన్ని ఆధునిక సాంకేతిక యుగం వైపు నడిపించిన మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని ఐనవోలు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్ అన్నారు. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం ఐనవోలు మండల కేంద్రంలోని నంది సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ దార్శనికతతోనే భారతదేశం 21వ శతాబ్దపు సాంకేతిక యుగంలోకి అడుగుపెట్టిందన్నారు. కంప్యూటర్, టెలికమ్యూనికేషన్ రంగాల్లో విప్లవాత్మక మార్పులకు ఆయన



పునాది వేశారని పేర్కొన్నారు. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం ద్వారా దేశ భవిష్యత్తును నిర్దేశించే యువతను ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములను చేసిన ఘనత రాజీవ్ గాంధీకి దక్కుతుందన్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాజీవ్ గాంధీ చేసిన కృషి చారిత్రాత్మకమని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజలకు అధికార వికేంద్రీకరణ జరగాలనే లక్ష్యంతో ఆయన చేపట్టిన సంస్కరణలు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు మరింత బలం చేకూర్చాయని అన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని శాంతి, మత సామరస్యం, జాతీయ సమగ్రతను కాపాడేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజాక్షేత్రంలో నిరంతరం పనిచేయాలని మోహన్ గౌడ్ పిలుపునిచ్చారు. దేశ ప్రగతి, యువత భవిష్యత్తు, ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజీవ్ గాంధీ చూపిన మార్గంలో ముందుకు సాగాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆర్. నాగరాజు, డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఐనవోలు మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, పోటీ చేసిన సర్పంచ్ అభ్యర్థులు, ఎస్సీ, బీసీ, మైనారిటీ సెల్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై రాజీవ్ గాంధీకి ఘన నివాళులర్పించారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక

శుక్రవారం ఆగస్ట్ 21, 2026

# రైల్వే అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: ఎంపీ ఈటల రాజేందర్







**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు 20**
దక్షిణ మధ్య రైల్వే (ఎస్సీఆర్) పరిధిలోని పార్లమెంట్ సభ్యుల వార్షిక సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. గురువారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో జరిగిన ఈ సమావేశంలో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో పాటు రైల్వే ఉన్నతాధికారులు హాజరయ్యారు.
మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, నిర్మాణంలో ఉన్న రోడ్డు అండర్ బ్రిడ్జిలు, రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు, కొత్తగా అవసరమైన పాదచారుల వంతెనలు నిర్మాణంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈటల రాజేందర్ రైల్వే అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. గతంలో రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నిధులు సమకూర్చేవని, ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ చొరవతో రైల్వే ప్రాజెక్టులకు వంద శాతం నిధులను కేంద్ర ప్రభుత్వమే అందిస్తోందన్నారు. రైల్వే స్టేషన్ల అభివృద్ధి, రోడ్డు అండర్ బ్రిడ్జిలు, రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు, మల్టీ మోడల్ రవాణా వ్యవస్థ రైళ్ల విస్తరణతో పాటు భూసేకరణ బాధ్యతను కూడా రైల్వే శాఖే చేపడుతోందని తెలిపారు. రైలు పట్టాలు దాటే సమయంలో ప్రమాదాలు నివారించేందుకు సాధ్యమైనన్ని ఎక్కువ రోడ్డు అండర్ బ్రిడ్జిలు, పాదచారుల వంతెనలు నిర్మించాలని సూచించారు. ఫతేనగర్ వద్ద ప్రతిరోజూ వేలాది మంది పట్టాలు దాటుతుండగా ఇప్పటివరకు 45 మంది ప్రాణాలు కోల్పోయారని, అక్కడ అత్యవసరంగా పాదచారుల వంతెన నిర్మించాలని కోరారు.
మల్కాజిగిరి నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న 24 రోడ్డు అండర్ బ్రిడ్జిలు, రోడ్డు ఓవర్ బ్రిడ్జిల పనులను త్వరగా పూర్తి చేయాలని, మేడ్చల్‌లో రూ.25 కోట్లతో, మల్కాజిగిరిలో రూ.26 కోట్లతో జరుగుతున్న రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక రైళ్లు నడపాలని, రోడ్డు అండర్ బ్రిడ్జిల వద్ద వర్షపు నీరు నిలిచిపోకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. హైదరాబాద్ నగర జనాభా పెరుగుతున్న నేపథ్యంలో మల్టీ మోడల్ రవాణా వ్యవస్థ (ఎంఎంటీఎస్) రైళ్లు, స్టేషన్ల సంఖ్యను పెంచాలని, యాదగిరిగుట్ట వరకు ఈ ప్రాజెక్టును పూర్తిగా కేంద్ర నిధులతో చేపట్టే ఆలోచన ఉందన్నారు. అలాగే ఆనంద్‌బాగ్, అల్వాల్ వెంకటాపురంలో కొత్త రైల్వే స్టేషన్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. అధిక వేగ రైలు ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలిపినా, మార్గం ఇంకా ఖరారు కాలేదని, భూములు కోల్పోతామనే ఆందోళన అవసరం లేదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రైల్వే అభివృద్ధి కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందుకు వచ్చి సహకరించాలని ఎంపీ రాజేందర్ కోరారు.

# డీలిమిటేషన్‌పై సీఎం వ్యాఖ్యలకు తెలంగాణ రక్షణ సేన విమర్శలు

- ఢిల్లీ, విదేశీ పర్యటనలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్





**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు 20**
డీలిమిటేషన్ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం వైఖరికి భిన్నంగా ఉన్నాయని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు సయ్యద్ ఇస్మాయిల్ విమర్శించారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ అసెంబ్లీ స్థానాలు 50 శాతం పెరిగి 184కు చేరుతాయని, కాంగ్రెస్ పార్టీ 117 స్థానాల్లో విజయం సాధిస్తుందని ముఖ్యమంత్రి పదేపదే చెబుతున్నారని ఆయన పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో కూడా రాష్ట్ర అసెంబ్లీ స్థానాల పెంపుపై సీఎం తన ప్రతిపాదనలు వెల్లడించినప్పటికీ, ఆ అంశాన్ని పార్టీ జాతీయ నాయకత్వం పరిగణనలోకి తీసుకున్నట్లు కనిపించలేదని వ్యాఖ్యానించారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరిగే అవకాశముందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలకు, ముఖ్యమంత్రి వ్యాఖ్యలు భిన్నంగా ఉన్నాయని ఇస్మాయిల్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇంకా ఎలాంటి అధికారిక నిర్ణయం ప్రకటించకముందే అసెంబ్లీ స్థానాల పెంపుపై సీఎం స్పష్టమైన సంఖ్యలు ప్రస్తావించడం ఎలా సాధ్యమైందో ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా డీలిమిటేషన్ అంశంపై ప్రభుత్వం తన వైఖరిని స్పష్టంగా వెల్లడించాలని, ప్రజల్లో ఉన్న సందేహాలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

- ఢిల్లీ, విదేశీ పర్యటనలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తరచూ ఢిల్లీ, విదేశీ పర్యటనలు నిర్వహిస్తున్నారని ఇస్మాయిల్ అన్నారు. ఆయా పర్యటనల ద్వారా రాష్ట్రానికి ఎంత మేర పెట్టుబడులు వచ్చాయి, ఎన్ని ఒప్పందాలు కార్యరూపం దాల్చాయి, ఎన్ని పరిశ్రమలు స్థాపించబడ్డాయనే అంశాలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సింగపూర్, దావోస్ తదితర విదేశీ పర్యటనల ఫలితంగా ప్రకటించిన పెట్టుబడుల్లో ఇప్పటివరకు ఎంత మొత్తం గ్రౌండింగ్ అయిందో వెల్లడించాలని కోరారు. అధికారిక, వ్యక్తిగత పర్యటనలకు సంబంధించిన ఖర్చుల వివరాలను కూడా ప్రజల ముందుంచాలని ఆయన అన్నారు.

- రాష్ట్ర సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

రాష్ట్రంలో నిరుద్యోగం, ఉపాధి, సంక్షేమ పథకాల అమలు వంటి అనేక సమస్యలు కొనసాగుతున్నాయని సయ్యద్ ఇస్మాయిల్ పేర్కొన్నారు. ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాలని సూచించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ఉన్న సంబంధాలను రాష్ట్ర ప్రయోజనాల కోసం వినియోగించి, తెలంగాణ అభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టులు, నిధులు తీసుకురావాలని ముఖ్యమంత్రికి ఆయన విజ్ఞప్తి చేశారు.

# వరంగల్ రైల్వే అభివృద్ధికి 19 ప్రతిపాదనలు..

## దక్షిణ మధ్య రైల్వే జీఎం దృష్టికి వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

- కాజీపేట డివిజన్ ఏర్పాటు, కొత్త రైళ్లు, స్టేషన్ల ఆధునీకరణ, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక విజ్ఞప్తి



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 20**
వరంగల్--కాజీపేట ప్రాంతాన్ని దక్షిణ భారతదేశంలో అత్యంత కీలకమైన రైల్వే హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి 19 కీలక ప్రతిపాదనలు తీసుకెళ్లారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అధ్యక్షతన నిర్వహించిన ఎంపీల సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆమె, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన రైల్వే మౌలిక వసతులు, ప్రయాణికుల సౌకర్యాలు, ఉద్యోగుల సంక్షేమం, కొత్త రైళ్లు, స్టేషన్ల అభివృద్ధి తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు. కాజీపేట-- వరంగల్ ప్రాంతం బొగ్గు, సిమెంట్, ఎఫ్‌సీఐ, ఎరువులు, గ్రానైట్ వంటి పారిశ్రామిక సరుకు రవాణాలో కీలక కేంద్రంగా ఉండటంతో పాటు దక్షిణ మధ్య రైల్వేకు అత్యధిక ఆదాయం సమకూర్చే ప్రాంతాల్లో ఒకటిగా నిలుస్తోందని ఎంపీ పేర్కొన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి తగిన ప్రాధాన్యత కల్పించాలని ఆమె కోరారు.

- ప్రధాన ప్రతిపాదనలు ఇవే...

- కాజీపేట కేంద్రంగా ప్రత్యేక రైల్వే డివిజన్ ఏర్పాటు.
- కాజీపేట రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులను వేగవంతం చేసి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం.
- వాగన్ వర్క్‌షాప్ ప్రాంతంలో రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం.
- కాజీపేట జంక్షన్‌లో రెండు కొత్త ప్లాట్‌ఫారాలు, ఎస్కలేటర్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల ఏర్పాటు.
- కాజీపేట టౌన్ స్టేషన్ ఆధునీకరణతో పాటు అన్ని ప్రధాన రైళ్లకు హాల్ట్ కల్పించడం.
- కాజీపేట నుంచి కొత్త ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రారంభించడం, పద్మావతి ఎక్స్‌ప్రెస్‌ను ప్రతిరోజూ నడపడం.
- రైల్వే సబ్-డివిజనల్ ఆసుపత్రిని ఆధునీకరించి వైద్య సిబ్బందిని పెంచడం.
- రైల్వే కాలనీల్లో రహదారులు, డ్రైనేజీ, తాగునీటి వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి.
- డీజిల్, ఎలక్ట్రిక్ లోకో షెడ్లకు కొత్త ఫుట్ ఓవర్ బ్రిడ్జిల ఏర్పాటు.
- ఉద్యోగుల కోసం విశ్రాంతి గదులు, ట్రైనింగ్ స్కూల్ పునరుద్ధరణ.
- భూపాలపల్లి ప్రాంతానికి కొత్త రైల్వే స్టేషన్, రైల్వే లైన్ ఏర్పాటు.
- కాజీపేట బస్ స్టేషన్ నిర్మాణానికి రైల్వే భూమి కేటాయింపు.
- ఫాతిమా బ్రిడ్జి వద్ద రెండో రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం.
- నెహ్రూ నగర్ రైల్వే క్వార్టర్స్ స్థలాన్ని వాణిజ్యపరంగా అభివృద్ధి చేయడం.
- కాజీపేట స్టేషన్ వద్ద స్టీమ్ ఇంజిన్ నమూనాను ప్రత్యామ్నాయ స్థలానికి తరలించడం.
- రైల్వే క్వార్టర్స్ నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించడం.
- రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్, కమ్యూనిటీ హాల్ ఆధునీకరణ.

అదనంగా, కాజీపేట, బెల్లంపల్లి రన్నింగ్ స్టాఫ్ ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ఎంపీ సమావేశంలో ప్రస్తావించారు. విజయవాడలోని గుణదల క్రూ డిపోను కాజీపేట లేదా వరంగల్‌కు తరలించాలని కోరుతూ, దీనివల్ల సిబ్బందికి మెరుగైన పని వాతావరణం కల్పించడంతో పాటు రైల్వే పరిపాలన మరింత సమర్థవంతంగా సాగుతుందని వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. కాజీపేట డివిజన్ ఏర్పాటు, రైల్వే మౌలిక వసతుల విస్తరణ, కొత్త రైళ్లు, స్టేషన్ల ఆధునీకరణ ద్వారా వరంగల్ ప్రాంతానికి జాతీయ స్థాయిలో మరింత రైల్వే ప్రాధాన్యత తీసుకురావడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

# భద్రాచలం రైల్వే జంక్షన్‌గా అభివృద్ధి చేయాలి: ఎంపీ రవిచంద్ర

- భద్రాచలం వరకు కొత్త రైల్వే మార్గం ఏర్పాటు చేయాలి..
- ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌లకు అనుసంధాన కేంద్రంగా తీర్చిదిద్దాలి





**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 20**
భద్రాచలం ప్రాంత అభివృద్ధితో పాటు దక్షిణాది రాష్ట్రాల మధ్య రైల్వే కనెక్టివిటీని మరింత బలోపేతం చేసేలా భద్రాచలాన్ని రైల్వే జంక్షన్‌గా అభివృద్ధి చేయాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. గురువారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జరిగిన దక్షిణ మధ్య రైల్వే జోనల్ సమావేశంలో ఆయన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. భద్రాచలంలో కొలువైన శ్రీ సీతారామచంద్ర స్వామివారి ఆలయానికి దేశవ్యాప్తంగా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్న నేపథ్యంలో, భద్రాచలం వరకు నూతన రైల్వే మార్గాన్ని ఏర్పాటు చేయడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. ప్రస్తుతం రైలు సౌకర్యాలు పరిమితంగా ఉండటంతో భక్తులు, పర్యాటకులు, స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.
భద్రాచలాన్ని కేవలం ఒక రైల్వే స్టేషన్‌గా కాకుండా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను అనుసంధానించే కీలక రైల్వే కూడలిగా అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. ఈ మార్గం అందుబాటులోకి వస్తే తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల మధ్య రవాణా, వాణిజ్యం, పర్యాటకం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు.
అదేవిధంగా ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదల, రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి, కొత్త రైళ్ల ఏర్పాటు, అవసరమైన ప్రాంతాల్లో రైళ్లకు అదనపు నిలుపుదల కల్పించడం తదితర అంశాలను కూడా ఎంపీ సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా తన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అందజేశారు. తెలంగాణలోని వెనుకబడిన ప్రాంతాలకు మెరుగైన రైల్వే సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్రజల దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించాలని ఆయన కోరారు.

# విద్యాబుద్ధులు నేర్పిన గురువుపై ఇంతటి ఘాతుకమా?

- ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్యపై సామాజిక కార్యకర్త శశిధర్ రెడ్డి తీవ్ర ఆవేదన
- నిందితులకు కఠిన శిక్ష విధించాలి.. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి



**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్, ఆగస్టు 20**
నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున పాఠశాల ప్రిన్సిపల్ రూపారెడ్డి దారుణ హత్య తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని వీణవంక మండలానికి చెందిన సామాజిక కార్యకర్త ఎలుక శశిధర్ రెడ్డి అన్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువునే హతమార్చడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. జల్సాలు, వ్యసనాల కోసం విద్యార్థులు ఇలాంటి పాశవిక చర్యకు పాల్పడ్డారన్న ఆరోపణలు సమాజం తలదించుకునేలా చేస్తున్నాయని పేర్కొన్నారు.

- నిందితులకు కఠిన శిక్ష

హత్యకు పాల్పడిన నిందితులను చట్టప్రకారం కఠినంగా శిక్షించి, బాధితురాలి కుటుంబానికి తక్షణ న్యాయం చేయాలని శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఘటన విద్యారంగానికే తీరని మచ్చగా మిగిలిందన్నారు.

- పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రుల నిఘా అవసరం

తల్లిదండ్రులు పిల్లల మార్కులు, ర్యాంకులపైనే కాకుండా వారి ప్రవర్తన, స్నేహాలు, అలవాట్లపై కూడా నిరంతరం దృష్టి పెట్టాలని సూచించారు. చిన్ననాటి నుంచే నైతిక విలువలు, బాధ్యత, జీవన నైపుణ్యాలను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు.

- మత్తు పదార్థాలపై ఉక్కుపాదం

గంజాయి, ఇతర మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, యువతకు అవి చేరకుండా ప్రభుత్వం మరింత కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

- పాఠశాలల్లో జీవిత నైపుణ్యాల విద్య

పుస్తక జ్ఞానంతో పాటు భావోద్వేగ నియంత్రణ, సరైన నిర్ణయాలు తీసుకోవడం, మంచి-చెడుల మధ్య విచక్షణ వంటి అంశాలపై విద్యార్థులకు జీవిత నైపుణ్యాల విద్యను పాఠశాల స్థాయి నుంచే తప్పనిసరిగా బోధించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, సమాజం సమష్టిగా బాధ్యత తీసుకోవాలని శశిధర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్‌ను బలహీనపరిచే వ్యాఖ్యలు మానుకోవాలి

- కష్టకాలంలో పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు న్యాయం చేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సహించేది లేదు



**కరపత్రం ప్రతినిధి వరంగల్, ఆగస్టు 20**
కాంగ్రెస్ పార్టీని బలహీనపరిచేలా ఎవరూ వ్యాఖ్యలు చేయొద్దని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ సూచించారు. బీఆర్ఎస్ పాలనలో పార్టీ అధికారంలో లేని సమయంలోనూ కాంగ్రెస్ జెండాను మోసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు, రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని పార్టీ అధిష్ఠానాన్ని కోరారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ భవన్‌లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేర కార్పొరేషన్ చైర్మన్ సంఘ్ వెంకటరాజ్యం, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డితో కలిసి అయూబ్ మాట్లాడారు.
పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అనేక ఇబ్బందులు ఎదురైనా పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తల త్యాగాలను గుర్తించాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉందన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వారికా.. లేక ఇప్పుడు 'అచ్చ కాంగ్రెస్--పచ్చ కాంగ్రెస్' అంటూ వర్గీకరణలు చేసుకునే వారికా ప్రాధాన్యత దక్కుతోందో ఆలోచించాలన్నారు.
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బహిరంగ వేదికలపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సీఎం పదవి గౌరవాన్ని, పార్టీ ప్రతిష్ఠను కాపాడటం ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యత అన్నారు. ఎన్నికల విజయాలను వ్యక్తిగత ఖాతాలో వేసుకోవడం సరికాదని, పార్టీ బలం, కార్యకర్తల కృషి, నాయకత్వమే విజయాలకు కారణమన్నారు.
కాంగ్రెస్ నాయకులకు రాజకీయ అవకాశాలు కల్పించలేదన్న విమర్శల్లో వాస్తవం లేదని అయూబ్ పేర్కొన్నారు. కొండా సురేఖకు పలుమార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా, కొండా మురళికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి నాయకుడు, కార్యకర్తకు తగిన సమయంలో గుర్తింపు లభిస్తుందన్నారు. టికెట్లు, రాజకీయ పదవులు కోరుకోవడం, పార్టీపై అభిప్రాయాలు వ్యక్తం చేయడం నాయకులు, కార్యకర్తల హక్కేనని, అయితే అంతర్గత అంశాలను బహిరంగ వేదికలపై చర్చించి పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించడం సరికాదన్నారు. సమస్యలను పార్టీ వేదికలపైనే పరిష్కరించుకోవాలని సూచించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కష్టకాలంలో కాంగ్రెస్ జెండాను మోసిన కార్యకర్తలకు అండగా నిలిచేలా అధిష్ఠానం తగిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.
సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అందోలు-జోగిపేట 20వ వార్డులో మురికి కాలువల శుభ్రత

- పారిశుద్ధ్యంపై చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి ప్రత్యేక దృష్టి

అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు, పోలీస్ స్టేషన్ వెనుక భాగంలో ఉన్న మురికి కాలువ చెత్తతో పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ సమస్య మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి దృష్టికి రాగా, ఆయన తక్షణమే స్పందించి మురికి కాలువల సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. చైర్మన్ ఆదేశాల మేరకు పారిశుద్ధ్య కార్మికుల ద్వారా ఇఇ శ్రీకాంత్ పర్యవేక్షణలో పిచ్చి మొక్కలను తొలగించి మురికి కాలువలను పూర్తిగా శుభ్రం చేయించారు. సమస్యకు తక్షణ పరిష్కారం చూపిన చైర్మన్ చొరవను స్థానికులు అభినందించారు. అలాగే ఎవరైనా చెత్తను చెత్త వాహనంలో వేయకుండా మురికి కాలువల్లో, ఇళ్ల పరిసర ప్రాంతాల్లో వేస్తే వారిపై చర్యలు తీసుకోవాలి అని పలువురు అభిప్రాయపడ్డారు.